
కథ

# అత్తమ్మ

- భమిడి వెంకటేశ్వర్లు



**అత్తమ్మ రాకతో రెండురోజులు యిట్టే గడిచిపోయింది. ఆవిడ నోరు విప్పితే తిట్లు. విమర్శలు ధారాళంగా దొర్లిపోతాయి. అరవై అయిదేళ్ళ అత్తమ్మకు అరవై ఏళ్ళనాటి సంగతులు, బాగాగుర్తు. మొదలు పెట్టిందంటే నాన్‌స్టాప్‌గా వాయించడం. ఆవిడ ప్రత్యేకత. అందుకే శ్రీరావుకి టి.వి. మీదకు దృష్టి పోలేదు. ఎదురుగా అత్తమ్మ వుంటే టి.వి. రేడియో పేపరు కూడా అనవసరమే.**

శ్రీరావుకి అత్తమ్మ నిజంగా అత్తమ్మకాదు. అలాని మరో చుట్టరికం కూడా లేదు. ఆవిడ - అతని తల్లి తరపు బంధువు. గుంటూరులో పనిచేస్తున్నప్పుడు అంటే మూడున్నర దశాబ్దాలక్రితం - ఆవిడతో కబుర్లు గుర్తొచ్చాయి. ఆఫీసు నుంచి యింటికి రాకపోతే అత్తమ్మ యింటికే వెళ్ళివుంటాడు - అనుకునేది శ్రీరావు తల్లి. ఇక ఆదివారం వచ్చిందంటే పొద్దున్న వెళితే రాత్రికే యింటికి వచ్చేవాడు శ్రీరావు. అందుకే అతని తల్లికి అత్తమ్మంటే చిరాకు కోపం.

శ్రీరావు నగరానికి బదిలి అయివచ్చాక రెండు మూడు సార్లు కలిసింది అత్తమ్మ. ఆరేళ్ళ తరువాత యిప్పుడే రావడం.

అత్తమ్మ భలే సరదా మనిషి. ఖర్చుమనిషి. భర్త ఎప్పుడూ ఆవిడకు డబ్బులిచ్చేవాడు కాదు. ఆరుగురు కొడుకులున్నా ఎవరూ ఆవిడకు పావలా బిళ్ళ కూడా యివ్వరు. ఈ మధ్యనే భర్తపోవడం, కొడుకులు యిల్లు అమ్మేయటం, ఎవరికి వారు, వేరు కాపురాలు పెట్టుకోడం. ఇల్లు అమ్మకంలో అత్తమ్మకు రెండు లక్షలు యిచ్చినట్టే యిచ్చి, ప్రస్తుతం నలభై వేలు బ్యాంకు బాలెన్సుకి దగ్గరగా వుందని కబుర్లల్లో విశేషాలు "ఒపదివేలు సద్దరా " అని టెండరు వేసింది అత్తమ్మ. అయితే శ్రీరావు కది ఆశ్చర్యం కలిగించ లేదు.

మొదట్నుంచీ తనవద్ద అయిదు, పది అంటూ తీసుకోవడమే గాని తిరిగి యిచ్చిన దాఖలాలు లేవు.

''నేనేం సద్దలేను. అయినా నీకు యింక డబ్బెందుకు. అన్నాడు శ్రీరావు.

అత్తమ్మ అరగంట సేపు క్లాసుతీసుకుంది.

''అయితే నన్ను చిట్టెమ్మయింటికి తీసుకువెళ్ళు'' అంది అత్తమ్మ.

ఆవిడకు చిట్టెమ్మ పట్ల ప్రేమ, ఆప్యాయత వుండి కాదు. ఆవిడకు టెండరు వేయాలని.

స్టేషను దగ్గర ఆటో ఎక్కారు శ్రీరావు అత్తమ్మ. ఇరవైనిముషాల తరువాత ఆటో అవిడయ్య యింటికి కొంచెం దూరంలో ఆగింది.

''ఇంటి ముందు ఆపమనకపోయావా '' అంది అత్తమ్మ.

శ్రీరావు జవాబు చెప్పలేదు

ఆటోకు ముప్పయి రూపాయలయింది. అతనికి భలే చిరాగ్గా వుంది. అంతకన్నా ఎక్కువ కోపంగా ఉంది. చిట్టెమ్మ తీరు అతన్ని మరింత బాధిస్తోంది. నిజానికి అత్తమ్మ కూడా వూహించలేదు, అలా జరుగుతుందని.

'' ఆ కనబడే యిల్లే అవిడయ్య యిల్లు నీకు తెలుసుగా. ఇదివరకూ వెళ్ళేవు కదా '' అన్నాడు శ్రీరావు యింటివైపు చూపిస్తూ.

''నువ్వు లోపలకు రావా '' అందిఅత్తమ్మ

''వద్దులే అత్తమ్మా. నాకా అదృష్టం లేదులే.. నేను మరికొంత కాలం బతకాలంటే ఆ యింటికి దూరంగా వుండాలి'' అన్నాడు నొచ్చుకుంటూ.

''అసలు ఏమైంది. నాకు చెప్పలేదేం !

''నిన్ను బాధపెట్టడం ఎందుకని! నువ్వు చూస్తున్న శ్రీరావు ఎప్పుడో చచ్చిపోయాడు. ఇప్పుడు కేవలం నిర్జీవంగా బతుకుతున్న శ్రీరావుని నువ్వు చూస్తున్నావు. అవిడయ్యను నేను రామాలయంలో కలుస్తుంటాను. ఇప్పుడు నేను నీతో వస్తే అవిడయ్య కొడుకు నన్ను చూసి నిజంగానే చంపేస్తాడు. అదంతా వదిలేయ్. కారణాలు అడగకు. నన్ను ఒత్తిడి చేయకు అన్నాడు శ్రీరావు.

అవిడయ్య అత్తమ్మకు దగ్గర బంధువు. ఆయనకు ఎనభై ఏళ్ళుంటాయి. ఆరేళ్ళక్రితం భార్యపోయింది. అప్పుడప్పుడు అత్తమ్మ వచ్చి ఆయన్ని చూసి వెడుతూవుంటుంది. కాని యిప్పటి రాకలోని విశేషం - ఆయనకు అయిదువేలకు టెండరు వేయాలని!

''నేను బస్టాపులోనే వుంటాను. ఒకవేళ నీకు చిట్టెమ్మ అనుభవం ఎదురైతే యిక్కడికి వచ్చేయ్. మనింటికి వెళ్ళిపోదాం.రేపు నిన్ను గుంటూరులో బస్సు ఎక్కిస్తాను'' అన్నాడు శ్రీరావు.

''చిట్టెమ్మకు అవిడయ్యకు పోలిక ఏమిటి ... అయినా చిట్టెమ్మకు బాగా పొగరెక్కింది. బాగా డబ్బు వెనకేసింది. కొడుకులు చేతికందొచ్చి ప్రయోజకులయ్యారు. దానికి తగ్గట్టు చిట్టెమ్మ కూడా ఏదో చిన్న వ్యాపారం చేస్తోందిగా ..' అంది అత్తమ్మ నిష్టూరంగా.

అసలు చిట్టెమ్మ ఇంటి దగ్గర జరిగిందేమిటి

'చిట్టెమ్మ యింటికి ' చేరాక -'

పదినిముషాల తరువాత వచ్చింది. ఎక్కడ్నుంచో సదరు చిట్టెమ్మ. వీధి అరుగుమీదే కూర్చున్నారు ముగ్గురూ కనీసం లోపలక్కూడ రమ్మనలేదు షోకాల్డు చిట్టెమ్మ.

నిజానికి అత్తమ్మ ఆయింట్లో ఒకటి రెండు రోజులుండి, అక్కడ్నుంచి అవిడయ్య యింటికి వెళ్ళాలని ఆలోచన !

''నేనింక వెడతాను'' చిట్టెమ్మతో అన్నాడు శ్రీరావు - అతను అవమానంగా ఫీలయ్యాడు.

''మరి మీ అత్తమ్మను తీసుకెళ్ళవా ? చటుక్కున అంది చిట్టెమ్మ.

శ్రీరావు షాక్ తిన్నాడు - ఇలా అడిగిందేమిటి అనిపించింది. తను తప్పుగా విన్నాడనిపించింది కూడా అంతా గజిబిజిగా వుంది.

ఏమీలేదు. చిట్టెమ్మ సరిగానే అంది. అంతకన్నా చక్కగానే శ్రీరావుకి వినిపించింది.

''అత్తమ్మ నీ దగ్గర ఒకటి రెండు రోజులు ...'' అన్నాడు శ్రీరావు.

అతని మాటలు పూర్తి కాకుండానే అంది చిట్టెమ్మ" ఇప్పుడు మాయింట్లో కుదరదు. తీసుకెళ్ళు" అంటూ

ఈసారి అత్తమ్మ ఆశ్చర్యపోయింది.

"ఇంక ఆలస్యం దేనికి అప్పుడే ఆరుగంటలయింది. ఆవిడయ్య యింటిలో దిగపెట్టు" అంది అత్తమ్మ మరింత అసహనంగా.

చిట్టెమ్మ యింత నిర్లక్ష్యంగా ఎందుకు ప్రవర్తించిందో యిద్దరికీ అర్థంకాలేదు.

శ్రీరావు అత్తమ్మ ఆటోఎక్కారు.

"ఇలా జరిగిందేమిటి "ఆటోలో అడిగాడు శ్రీరావు అత్తమ్మని.

"అదే నాకూ అర్థం కావటంలేదు " అందావిడ

"అసలు ముందే యిక్కడకు రావలసింది అయినా చిట్టెమ్మలాంటి మనుషుల దగ్గరకి వెళ్ళేప్పుడు రెండు మూడుసార్లు బాగా ఆలోచించాలి. నడమంత్రపు సిరి పట్టిన వాళ్ళను అర్థం చేసుకోలేము. మరింత చిరాగ్గ వుంది శ్రీరావు గొంతు.

అత్తమ్మ మౌనంగా వింటోంది.

"పోనీలే " ఇదొక అనుభవంగా మిగిలిపోతుంది' అన్నాడు శ్రీరావు.

అత్తమ్మ ఇంట్లోకి వెళ్ళే వరకూ సందు చివరే నిలబడ్డాడు. ఆ తరువాత బస్టాపువైపు నడిచాడు శ్రీరావు.

పదినిముషాల తరువాత శ్రీరావు కలిసింది అత్తమ్మ. ఆశ్చర్యంకలిగింది అతనికి.

" ఏమైంది " ఆత్రంగా అడిగాడు శ్రీరావు.

"అవిడయ్య యింట్లో లేడు కొడుకు బయటకు వెళ్ళాడట. పెళ్ళాం గుడికెళ్ళిందట. ఇంకాసేపటిలో వచ్చేస్తారుట. వాళ్ళింట్లో అద్దెకున్నావిడ చెప్పింది" అత్తమ్మ చెబుతోంది.

"అయితేసరే "మరివెళ్ళవా ? "

" నువ్వింక వెళ్ళు. చాలాదూరం వెళ్ళాలి" అంది అత్తమ్మ.

అంతలో బస్సొచ్చింది

"మర్నాడు పొద్దున్న పదిగంటలకు కాలింగ్‌బెల్ చప్పుడులో తలుపు తీసాడు శ్రీరావు ఎదురుగా అత్తమ్మ.

"గుంటూరు వెళ్ళలేదా " అడిగాడు తను.

"గుంటూరులో ఏమిటి రాత్రి గుళ్ళో పడుకున్నాను" అంది అత్తమ్మ చిరాకుపడుతూ.

"ఏం !"

" అవిడయ్య రాత్రి రాలేదు. కొడుకు - కోడలు తమ యింట్లో వుండద్దన్నారు. రైలు ఎక్కించమన్నాను. కుదరదన్నారు. పైగా గుళ్ళో పడుకోమని సలహాయిచ్చారు. అత్తమ్మ బాధపడుతోంది.

శ్రీరావు ఆవిడను ఆప్యాయంగా ఆహ్వానించాడు. "అత్తమ్మ లోకం మారకపోయినా, మనుషులు ఆలోచనలు మారిపోతున్నాయి. జేబులో రూపాయలు, బాంకు బాలెన్సులు, ఆస్తిపాస్తులు పెరిగేసరికి మానవత్వం మంచి మర్చిపోతున్నారు".

అత్తమ్మ ఆశ్చర్యంగా వింటోంది.

"అవిడయ్య పరిస్థితే నాకు బాధగా వుంది' మాటల మధ్యలో అన్నాడు శ్రీరావు.

"ఏం .. ఏమైంది"

" అంతవయసొచ్చాక అవిడయ్యకు ఎన్నికష్టాలో మరి ! పదిహేను లక్షల విలువైన యింటిని తనపేరన రాయించుకొని అన్నదమ్ములని - అక్కచెల్లెళ్ళని దూరం చేసేసి విడదీసి తండ్రి దగ్గరకు రాకుండా చేసాడు కొడుకు. తండ్రికి భోజనం పెట్టేందుకు రెండు వేలు వసూలు చేస్తాడు. నరకం అనుభవిస్తున్నాడు. ఆపెద్దాయన. ఇదితెలియని నేను ఆయన్ని మాయింటికి రమ్మన్నాను. నేను ఆ యింటిని కొట్టేస్తాననుకున్నాడు. ఆ కొడుకు నేనేదో గూడుపుఠాణి నడుపుతున్నానని నామీద చేయిచేసుకుని చంపే ప్రయత్నం చేసాడు వాడు. అప్పట్నుంచీ అవిడయ్యను చూడాలంటే ఏగుళ్ళోనో, బస్టాపులోనూ చూస్తాను. మంచికి పోతే చెడు ఎదురైందనట్లుగా అయింది నాపరిస్థితి ". శ్రీరావు చెబుతున్నాడు.

అత్తమ్మ ఆలోచనలో పడింది.

"ఏమిటి " అని అడిగాడు శ్రీరావు

"నాకు ఆరుగురు కొడుకులున్నా, ఏంలాభం?

ఎవరిబతుకు, ఆలోచనలు వారివి. వాళ్ళల్లో వాళ్ళకే పడిచావదు. ఇహనన్ను ఎందుకు ఎలా చూస్తారు!"

అత్తమ్మకళ్ళు చెమరుస్తన్నాయి.

"బాధపడకు అత్తమ్మ" అన్నాడు శ్రీరావు.

"నాకో సలహాయిచ్చారు నానుపుత్రులు" అందావిడ కొద్దిగా తటపటాయిస్తూనే.

"ఏమని "

" నా వంట్లో ఓపిక వుందని వంటలు బాగా చేస్తానని 'మెస్' నడపమన్నారు. లేకపోతే ఏ హాస్టల్లోనో వంట మనిషిగా పనిచేయమన్నారు. ఊరికే కూర్చుంటే వళ్ళువస్తుందట బద్ధకం వస్తుందట - అవకాశం వున్నప్పుడు డబ్బు సంపాదించాలిట" కొంగుతో కళ్ళు తుడుచుకుంటుందావిడ.

శ్రీరావు ఆలోచనలో పడ్డాడు.

"సాయంత్రం గుంటూరు వెళ్ళిపోతాను' అంది చటుక్కున అత్తమ్మ.

"ఏమీ అనుకోనంటే నాదొక సలహా !

" ఏమిటి "? అడిగిందావిడ

" ఎటూ అవిడయ్యా - నువ్వు ఒంటరివాళ్ళే ఎందరు కొడుకులున్నా మీరిద్దరూ ఒకరికొకరు తోడుగా, సహాయకారిగా వుంటే బాగుంటుందేమో నువ్వు అవిడయ్యతో వుంటే అతని కొడుకుని, కోడల్ని దారిలో పెట్టగలవన్న నమ్మకం నాకుంది. ఆలోచించు కుని చెప్పు. తరువాతే అవిడయ్యకు చెబుతాను నేను " అన్నాడు శ్రీరావు

అత్తమ్మ మరోసారి ఆలోచనలోపడింది. "బాగా ఆలోచించుకో. బలవంతం లేదు. నీకొడుకులతో సంప్రదించాలా "...

" అదేంలేదు. ఇది నావ్యక్తిగతం నాయిష్టం. నన్ను పట్టించుకోని వారికోసం నేను ఎందుకు ఆలోచించాలి." అంది అత్తమ్మ.

మర్నాడు సాయంత్రం శ్రీరావు, అత్తమ్మ యీ శుభవార్తను అవిడయ్యకు చెప్పేందుకు వెళ్ళారు ✪

✤ ✤ ✤ ✤ ✤

*With Best Compliments from :*

**BHARAT DYNAMICS LIMITED**

(A Government of India Enterprise)
Ministry of Defence
Kanchanbagh
Hyderabad - 500 058